# ఇదా సానుభూతి!!!!

కుమారి కె. దివ్యజ్ఞాన సరోజినీదేవి

అదొకచిన్న పల్లెటూరు, పట్నవాసపు వాసనలుసోకిన పల్లె. ముప్పది, నలుబది కాపరాలకన్న యెక్కువలేవు. అప్పుడు పదిగంటలు అయుంటుందికాని ఎండ మండిపోతూంది. ప్రొద్దుటినుండి సద్దుమణిగిన ఆవూరుమేల్కొంది. గృహిణులు భర్తలకు భోజనాలు పెట్టడములో నిమగ్నులైవున్నారు. ప్రొద్దున వెళ్ళిన జీతగాళ్ళు చద్దన్నాలకు తిరిగివస్తున్నారు. పొరుగూరు బడులకువెళ్ళే పిల్లలు వేళైపోయిందని గబగబ నడుస్తూ, కేకలేసుకుంటూ వెళ్తున్నారు. ఆసమయములో పెద్దబజారు పడమటివైపు ఒక యింటిలో యేడుపులు, పెడబొబ్బలు వినపడుతున్నవి. ఆ పల్లెటూరులోని వారందరు ఆ యింటిముందు గుమిగూడారు, ఆరోజు ఆ ఇంటిలో ఒక పద్ధెనిమిదేళ్ళ యువతి చనిపోయింది. ఆడవాళ్ళు యింటిలోకి సర్దుకున్నారు, మొగవారు చావిడిలోకిదారితీశారు. ఏడ్చేవాళ్ళు యేడుస్తున్నారు ఓదార్చేవాళ్ళు ఓదారుస్తున్నారు. బ్రతుకు బుద్బుదప్రాయమేగదా అనిముఖాలు వేలాడవేసుకొన్నారు. వీరుగాక తమ సానుభూతిని ప్రదర్శించేవారు మరికొందరు!

"కమలమ్మొదినా నీవూ వచ్చావే? ఇప్పుడేనా రావటము? పాపం యేమి చేస్తాము యెవరికి యెప్పుడు చావు రాసిపెట్టుందో యెవరికి తెలుసు"

"మరేనమ్మ అన్నపూర్ణా! లేకపోతే పద్ధెన్మిమిదేళ్ళు నిండని పిల్లకి చావేంటి? అదుగో శాంతమ్మక్కయ్య వస్తుంది."

"రా శాంతమ్మొదినా! దారిలో నిన్ను కేకద్దామనుకొని మళ్ళీ నీవు అన్నయ్యకు అన్నము పెట్టే పనిలో వుంటావని పిలవలేదు. పాపం సుబ్బమ్మ యిందాకటి నుంచి పార్వతి శవముపైపడి ఒకటే ఏడుపు"

"అవునమ్మా సుబ్బమ్మను చూస్తే కడుపు తరుక్కుపోతుంది పోనీ నీవుకేకవేసి పోకపోయావంటే

ఇవాళ యింట్లో నిమ్మకాయలు నిండుకున్నవి. మీ అన్నగారేమో భోంచేస్తున్నారు. మజ్జిగలోకి పిండుదామని చూస్తే నిమ్మకాయలు లేకపోయినవి. కామాక్షమ్మ అత్తని అడిగి రెండుపట్టు కొద్దామని వెళ్ళానోలేదో ఆమె లబోదిబోమని పోతుంది ఏమిటని అడిగితే, యింకేముంది చిట్టితల్లి పోయిందని హడావిడిగా పోయింది. యేవన్నా అడిగితే చెప్పిందా? రావమ్మగారి చాకలిది గంగి అటు పోతుంటే పిలిచి అడిగితే చెప్పింది. యిట్లా పార్వతి బావిలో పడిపోయిందని; అయితే కావాలని పడలేదంటావా?"

"అదేంలేదులే. కాంతమ్మక్కయ్యరోజూలాగేబావిలో నీళ్ళుతోడి పూలచెట్లకు పొయ్యబోయిందట. తల్లిగూడా ప్రక్కనే చెంబుతపాలా తోముకుంటుందట. "దబాల్" మని శబ్దమువిని చూస్తే యింకేముంది పార్వతి అక్కడ లేదు బావిలోకి చూచి లబోదిబోమని నలుగురిని పిలిచిందట. బావేమోలోతా, దిగటానికి కొందరు సందేహించారట. తీరాదిగేవాళ్ళు వచ్చేసరికి పార్వతి ప్రాణాలు పోయినవి. పాపం సుబ్బమ్మ దగ్గరఉండీకూడా కూతురునిచంపుకొన్నానని కంటికి మింటికి ఒకటే ధారగా ఏడ్చింది. అయినా కమలమ్మ వొదినా! దగ్గిరున్న చావు ముంచుకు వస్తుంటే మనము చేసేదేముంది."

"అంతేనమ్మా అన్నపూర్ణా. అన్నట్టు పార్వతికి పెళ్ళి కూడ కుదిరిందటగా"

"మరేనమ్మా వొదినా అన్నట్లు పెళ్ళంటే జ్ఞాపకము వచ్చింది. పొద్దుటినుంచి వచ్చి అడగాలనుకుంటున్నాను శాంతమ్మక్కా, రెండుమూడు రోజుల్లో అమ్మాయిని అత్తారింటికి పంపిస్తారటగా అయినా పెళ్ళయిన పిల్ల పుట్టింట్లో వుంటే యేమి బాగుంటుందిలే"

"మరే వొదినా మంచిరోజు చూసి పంపిద్దామను

కుదిరిన పెళ్ళి కొడుకు బి. ఏ చదివేడంటగా? కట్నము కూడ యెక్కువ లేదటగా?"

"అవునే శాంతమ్మక్కా, కాని ఆ గీత వుండొద్దు."

"మన కాంతకి సరిపోతా డంటావా అన్నపూర్ణా?"

"ఎందుకులే శాంతమ్మక్కా, ఆపిల్లాడి జాతకమెట్లాం టిదో? మొన్న పెళ్ళిచూపులకు వచ్చినరోజు నగలన్నీ పెడ్తే పార్వతి అచ్చు ఆ పార్వతీదేవిలాగ వున్నది."

"నిజమే అన్నపూర్ణమ్మ వొదినా. యేమి అందము, యేమి వినయము! యేమి తెలివి తేటలు! మంచి వాళ్ళ నెప్పుడు ఈ లోకంలో వుండనీయడమ్మా"

ఇదంతా వింటున్న ఒక యువతీమణి కలుగచేసుకొని "అదేమిటి పిన్నాము! యిట్లా అంటున్నావు? మొన్నొక సారినన్నుపిలిచి "ఆ అమ్మాయితో నీకెందుకే స్నేహము? పెళ్ళి పెడాకులు లేని పిల్ల తనకే గనక అందముందని మిడిసి పడుతుం"దని అన్నావు కదూ"!

"ఇదేమి చోద్యమే విమల! ఇది విన్నావటే శాంత మ్మొదినా? ఈ చదువుకున్న పిల్లలకి మతి పోతుంది. నేనెప్పుడు అట్లా అన్నాను? పార్వతి చిన్న పిల్లగా వున్నప్పుడేమన్న అన్నానేమో? దాని సుగుణాలు చూచిన మనిషికి అట్లాఅనటానికి నోరెట్లా వస్తుంది?"

"మరేనమ్మ కమలమ్మొదినా. అన్నపూర్ణ, నీకు జ్ఞాపకముందటే చిన్నప్పుడు మా రమతో ఆడుకోటానికి వచ్చేది. ఎంత బుద్ధి మంతురాలమ్మ. పాపం! తలుచు కుంటే కడుపు తరుక్కుపోతుంది"

"మరేనమ్మ శాంతమ్మక్కా ఏంచేస్తాము? చదువుంది. అందముంది, వినయముంది, పెళ్ళి కుదిరింది, అంతా ఖర్మ"

"అవునమ్మా అన్నపూర్ణా, ఆ సుబ్బమ్మనీ రామయ్యనీ చూస్తే గుండె తరుక్కుపోతుంది కడుపుతీపమ్మా కడుపు తీపి" అని పమిటచెంగుతో కన్నీళ్ల తుడుచుకొంది. కమలమ్మ.

"అంతా ఘటన, ఇన్నేళ్లు పెరిగి పోవాలా (వేడి నిట్టూర్పు) ఆ, శాంతమ్మక్కా మరిచా, ఇందాక నిమ్మ కాయలు నిండు కొన్నాయన్నావే, ఇవాళ మా బజార్లోన నిమ్మకాయలు వచ్చాయే!"

"అట్లాగా అన్నపూర్ణ ఈసారి వస్తే కాస్త మా బజారు వైపు రమ్మను. సరేగాని, మరల మీబావ కేకలేస్తుంటారు వెళ్ళొస్తాను. వెళ్ళొస్తాను వొదినా. పాపం ముక్కుపచ్చ లారని బిడ్డ పోయిందిగదా" అని చెంగుతో కళ్ళొత్తు కుంటూ పోయింది శాంతమ్మ.

ఇది సాను భూతా?

* * *

"అరె, నీవు గూడా వచ్చావే వెంకయ్యమామా? ఇప్పుడేనా ఈ వార్త వినటము?"

"మరే రమణయ్యా ఇప్పుడే పాలేరు అంటుంటే ఆ పాట, అన్నము కూడా తినకుండా పరిగెత్తుకు వచ్చా. ఏదో నాకు రామయ్యకు బంధుత్వము లేకపోయినా స్నేహము కుదిరిందిగదా, కాస్త ఓదార్చు దామని వచ్చా. అయినా కన్నతండ్రి దుఃఖము ఓదార్చితే పోతుందటలే?"

"మరే మావ! ఉన్నట్టుండి వచ్చింది చావు? ఇందాక వెంకట్రావు చెప్పాడు, తక్కువ కట్నానికి తన కూతురు పెళ్లి కుదిరిందని ఒకటే మురిసిపోయాడట. ఏంచేస్తాము, పాపం."

"నిజమే రమణయ్యా మొన్న సంతకి వెళ్తా యిటు వైపు వస్తే రామయ్య కనపడి సంతకా అన్నాడు. అవు నంటే నే కూడా వస్తానని వచ్చాడు. దారి పొడుగునా రెండో కూతురికి కూడ పెద్ద కూతురికి లాగ బ్రహ్మాం డంగా వివాహము చేయాలని, పట్నమెళ్ళి నగానట్రా తేవాలని చెప్పుకొచ్చాడు"

"అట్లాగా మామయ్యా! పాపం మతి చలించిపోయిన వాడిలా యెట్లా కూర్చున్నాడో! చూడు. ఏం చేస్తాము అట్లా రాసుంది గాబోలు ఆయన నొసట. అన్నట్లు సంతకు వెళ్ళానన్నావు, ఏమన్నా పనుండి వెళ్ళావా?"

ఏదోలే, కోడె దూడలు రెండు నాగలికి యెదిగొచ్చాయా, పాతవి అమ్ముదామనుకుంటున్నాను. ధరలు యెట్లున్నయ్యో చూద్దాము, అట్లాగే సరుకులు కొనుక్కు రావచ్చుగదా అని వెళ్ళాను"

"ఏ మాత్రమున్నాయ్యేం"?

"పదహారు వందలద్దాక పోతున్నవి. పదిహేను వందలకి తక్కువ అమ్మదలుచుకోలేదులే"

"నేను ఒక జత కొనుక్కోవాలను కుంటున్నాను మామయ్యా. పదకొండు వందలకన్న యెక్కువ పెట్టలేను"

"ఆ నీకు కావాలంటే సంతలో ఎద్దులకు కరువా? పాపం! ఆ పిల్ల హటాత్తుగా పోయిందే. చిన్నప్పుడు

పిల్లలతో ఆడుకుంటుంటే అప్పుడప్పుడు చూచా బంగారు బొమ్మల్లే వుండేది. అంతా ఖర్మ."

"మరే మామా, లక్ష్మి ముఖములో తాండవ మాడేది, పోనిలే, మామయ్యా పన్నెండు వందలకి ఒప్పుకో. అంత కన్న యెక్కువ ఎవరిస్తారు? నీ పోషణ క్రిందవున్నవి కాబట్టి అంతధర యివ్వటానికి సిద్దపడ్డాను కాని, లేకపోతే అంతయిచ్చి కొంటానా?

"లేదులే రమణయ్యా ఇది కుదిరే బేరము కాదులే. మొన్న యెవరోవచ్చి పద్నాలుగు వందలకి అడిగితే పదిహేను వందలకి తక్కువ యివ్వనన్నాను. పాపం రామయ్యకు అసలే ముసలి తనం, దానిపై -ఈ దెబ్బ యెట్లా యెదుర్కొంటాడో!"

"అవును, మామా, మరీ పిచ్చాడికిమల్లే కూర్చున్నాడు. లోపల సుబ్బమ్మ పిన్నాము యింకా యేడుస్తూనేవుంది. మరి కడుపు తీపి యేం చేస్తాము? వారెంత బాధ పడుతున్నారు. అంతా ఖర్మానుసారం. సరేగాని మామయ్యా నా ధర చెప్పాను. నిన్ను యిబ్బంది పెట్ట దలుచుకోలేదు. నీకు గిట్టుతుందంటే కబురుచెయ్యి"

"సరేలే రమణయ్యా. పోయొస్తాను. ఆ తండ్రి దుఃఖము చూడలేకుండా వున్నాను" అంటూ కండువా దులుపుకుంటూ నిష్క్రమించాడు వెంకయ్య.

ఇదా సానుభూతి!!

* * *

"విన్నావటరా సుందరా దుర్మరణం!" అన్నాడు ఎస్. ఎస్. ఎల్. సి లోనే అనర్సు చేసిన ఘటికుడు సూర్యం.

"అరరే అది ఎప్పు డొచ్చిందిరా? ఎవరి పరిశోధన? వాలిదా, అశ్వద్ధామదా, వేణుదా?" అన్నాడు డిటెక్టివ్ ప్రపంచ విహారి తిరుమలరావు.

"ఏమిటెరోయ్! ఇదేమీ డిటెక్టివ్ నవల కాదు. రామయ్యగారి కూతురుందే ఆవిడగారు బావిలో పడి చారు మన్నారు" ,

"ఏమిటి! బావిలో తోశారా? ఎవరో కనుక్కున్నారా?"

"బాగానే వుంది. ఆ అమ్మాయిని ఎవరూ హత్య చెయ్యలేదు. సాక్షాత్తు వాళ్ళమ్మ వుండగానే జరిగిందట"

"నీకు బాగా తెలుసా?"

"ఆఁ"

"ఆహా! సరే వస్తా నయితే"

"వుండరా, ఏమిటంత తొందర. కాస్త అటుపోయి సంగతి సందర్భాలు తెలుసుకొని వద్దాము"

"లేదులే సూర్యం. ఇవాళ రెండు కొత్త డిటెక్టివ్ నవలలు వస్తాయి. తొమ్మిది గంటల బండికి టవున్ వెళ్ళాలి"

"ఆ. ఆ బండి పదకొండు గంటలకి ముందు వచ్చిం దటలే!"

"ఆ! అయినా మళ్ళీ బండి అందుతుందో లేదో. అన్నట్టు పాపం రామయ్యగారు, సుబ్బమ్మగారు ఎంత బాధ పడ్తున్నారో! సరే వెళ్ళొస్తాను" అన్నాడు అప్పుడే వారి బాధ జ్ఞాపకము వచ్చిన తిరుమలరావు.

ఇదీ సానుభూతే!!!

* * *

"ఒసేవ్ సీతాము! విన్నావంటే" అనిఆల్లంతదూరాన పోతున్న సీతాంని వీధంతా ప్రతిధ్వనించేటట్టు పిలిచింది. చాకలి వెంకాయి "ఆ, ఆ, వస్తుండా. యేందే అట్ట కేకే స్తుండావు?" "ఆ. మరేంలేదు నెనెల్తానే సుబ్బమ్మగారింటికి ఆరమ్మాయి పార్వతమ్మగారు పోయారు"

"ఆ సంగతా! ఆ విన్నాను. ఇందాక లక్ష్మమ్మగారింటికి బట్టలకని వెళ్తే చెప్పారు."

"అట్టాగా, ఇంకా నీకు తెల్దేమోనని సెప్తుండ ఎంత మంచోరనుకున్నావు. మొన్న ఈ పండగకి కొత్తకోక యియ్యండమ్మగారు అని అడిగితే, అట్టాగేలే ఎంకాయి అన్నారు. మా సాకలోడు యెట్టాగు కొనియ్యడుగదా పండుక్కి కొత్తకోక వస్తుందిగందా అని సంబరపడ్డాను. పాపం, ఏంచేస్తాము యిట్టాగైంది. ఇక ఈ పండుగకు కొత్తకోక ఉత్తదే" అందీ వెంకాయి నిట్టూరుస్తూ.

"నిజమే ఎంకాయి. పాపం వారి అయ్యా అమ్మ ఎంత బాధపడ్తుంద్రో, సిన్నపిల్ల మనము చేసేదేముంది. అంతా ఆ రంగడి మహత్యము. ఆ అమ్మాయిగోరికి అంతే ఆయిస్సు పోసిందుగావాను, ఇంక నేనుత్తొందర్లో పప్పు బువ్వ వస్తుందిగదా అని మురిసిపోయా."

"ఏం చేస్తాము! ఒకసారి ఆరింటివైపు వెల్దామా?"

అమ్మో మా సాకలోడు చావగొట్టడు రేపుకింత ఆలస్యంగా వచ్చేవేమని. నువ్వు వెళ్లి సూసొచ్చి న్నాకు

సెప్పే. అన్నట్టు ఇందాక కొత్త కోక అంటే గుర్తొచ్చింది. ఇవాళ లక్ష్మమ్మగారిని అడగాలనుకుంటుండానే యిస్తారంటావా" అంటూ జవాబుకెదురు చూడకుండా వీపుమీద బరువుతో మెల్లగా అడుగులేసుకుంటూపోయింది సీతాము.

ఇదా సానుభూతి !!!

*    *    *

"ఒరేయ్ రాముడూ పొలాన్నించేనా!"

"అవునురా వెంకిగా! అన్నట్టువిన్నావా? ఇందాక పెద్ద బజారుకాడ వస్తుంటే రామయ్యగారింట్లో ఏడుపులు వినపడ్డాయి. ఆదేందిరా అని సన్నాసిగాణ్ణి అడగితే సెప్పిండు పార్వతమ్మగారు బావిలో నీళ్ల తోడుతూ పడినారని''

"అయ్యో పాపం సిన్నోరేగదరా? పోయినయేడు వారింట్లోనే సేసావుగదూ?"

"అవునురా రాముడు. ఆ సన్నాసిగాడు పాతికరూపాయలు తక్కువ అడిగాడని వాణ్ణి కుదుర్చుకొన్నారు. ఇప్పుడేమయిందో సూసావుగా నన్ను కుదుర్చుకునుంటే ఆపాట దఢాలున నూతిలోకి దూకి పార్వతమ్మగారిని రచ్చించి వుండేవాణ్ణిగదరా? ఆ సన్నాసిగాడికి యిట్టాటి పనులేమన్నా సేతవుతాయేంటి?"

"అవునురా పాపం. అంతా ఖర్మరా. రామయ్యగారి ముఖాన అట్టారాసుంది గావాను? అన్నట్టు సన్నాసిగాడంటే గుర్తుకువచ్చింది యివాళ రాత్రాటకి వెల్దాము అనుకొన్నాము. యిప్పుడేమొ వాడు రాలేడుగా, నువ్వు వస్తావటరా?"

"ఏం ఆటరా?"

"చువర్ణ చుందరిరా. మరే, రాషిసులు, డాన్సులు, పాటలు చాలవున్నాయంటరా"

"అట్లాగేరా, సరేగాని పాపం రామయ్యగారు, సుబ్బమ్మగారు ఎంత బాధ పడ్తున్రో''

"సత్తెమేరా ! సరేకానిరాత్రికి పనితొందరగాముగించుకొని సోడా సాపుకాడకి రా, వెళ్తారా, మళ్లీ సద్దన్నము తిని పొలంకాడకి వెళ్ళాలి"

ఇదా సానుభూతి !!!!!


